క్లుప్తంగా

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



ఊర్కొండ: ఊరుకొండపేట పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించుకున్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు

కొల్లాపూర్: పట్టణంలోని 16వ వార్డులో మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులను కౌన్సిలర్ నర్సింహారావు శనివారం పరిశీలించారు. వార్డులోని ప్రతి ఇంటికీ నీరు అందేలా కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

చారకొండ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి, సంఖ్యను మరింత పెంచాలని మండల కాంప్లెక్స్ హెచ్ఎం భగవాన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి, చంద్రాయన్‌పల్లి, గోకారం, తుర్కలపల్లి ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, ఉపాధ్యాయుల బోధనలు, పనితీరు పై ఆరా తీశారు.

ఆర్ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

మన్ననూర్: స్థానికంగా నిర్వహణలో ఉన్న ఆర్ఐటీఐలో వివిధ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హత కలిగిన విద్యార్థుల నుంచి రెండో విడత దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ జయమ్మ శనివారం ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో సీటురాని అభ్యర్థులు, కొత్తగా చేరేవారికి ఈ నెల 15వ తేదీలోపు http//www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్సెస్సీ మెమో, బోనోఫైడ్, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు పూర్తి వివరాలను పొందుపరిచి దరఖాస్తు చేసుకోవాలని, మరింత సమాచారం కోసం ఆర్ఐటీఐ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

తెలకపల్లి: మహాత్మా జ్యోతిరావుపూలే డిగ్రీ బాలుర కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ ప్రశాంత్ శనివారం తెలిపారు. పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ప్రవేశాలు జరుగుతున్నాయని అర్హత గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్‌లో పరిధిలో ఉన్న బాలుర డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ మీడియం ఉందన్నారు. బీఏలో హెచ్‌పీపీ, బీకాం, సీ, బీఎస్సీ, ఎంపీసీఎస్, ఎంపీసీ, ఎంఎస్, సీఎస్, ఎంఎస్‌డీఎస్, బీజెడ్‌సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 8న చివరి తేది అని సర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7993456693 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


ఖాదర్

కోడేరు: మండలంలోని నాగులపల్లికి చెందిన మాండ్ల ఖాదర్ అదృశ్యమయ్యాడు. ఈయన కొన్ని నెలల నుంచి మతిస్థిమితం లేకపోవడంతో మంగళవారం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ పిర్యాదు చేశామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8978228574, 9676085997 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

లింగాలలో యువకుడు..


భాస్కర్

లింగాల: మండలంలోని జీల్గుపల్లికి చెందిన జూలూరి భాస్కర్ అదృశ్యమైన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. మే 14వ తేదీన కిరాణ సామాన్లు తీసుకరమ్మని తల్లి లింగాలకు పంపగా అప్పటి నుంచి అదృశ్యమయ్యాడు. తల్లి మణెమ్మ శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. వివరాలు తెలిస్తే 8712657737, 9440183935, 8712530880 నంబర్లకు సమాచారం పోలీసులు తెలిపారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక

నాగర్‌కర్నూల్ రూరల్: క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లోని హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో హాజరుకావాలని డీవైఎస్ఓ సీతారాం ప్రకటనలో తెలియజేశారు. జిల్లా నుంచి 26 మంది ఎంపికయ్యారని చెప్పారు. ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, జనన ధ్రువీకరణ పత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, కమ్యూనిటీ సర్టిఫికెట్, 10 పాస్‌ఫొటోలు, రెండు జిరాక్స్ కాపీలను వెంట తీసుకొని వెళ్లాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9059174909 నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

- సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో తీరని సమస్యలు
- కిటికీలకు తలుపులు ఊడిపోయి, దుస్తులు అడ్డుగా కట్టుకుంటున్న విద్యార్థులు
- మరుగుదొడ్లకు తలుపులు లేని వైనం
- పట్టింపులేని అధికారులు, పాలకులు

ఏళ్ల తరబడి అదే తీరు..

సాక్షి విజిట్


ప్రహరీలేని ఉప్పునుంతల బీసీ హాస్టల్

ఉప్పునుంతల: ఒకప్పుడు విద్యార్థులతో నిండుగా ఉండే స్థానిక బీసీ హాస్టల్ ప్రస్తుతం విద్యార్థులు లేక వెలవెలబోతుంది. హాస్టల్‌లో సరిపడ వసతులులేక సమస్యలతో సతమవుతున్నారు. దీంతో విద్యార్థులు ఉండటానికి ఇష్టపడటం లేదు. 112 మంది విద్యార్థుల సామర్థ్యంగల ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 40 మంది మించడం లేదు. పాఠశాలలు తెరిచి నెల రోజులు కావస్తున్నా విద్యార్థుల సంఖ్య పెరగడంలేదు. కొన్నేళ్లుగా ఇన్‌చార్జి వార్డెన్‌లతో ఈ హాస్టల్‌ను నెట్టుకొస్తున్నారు. నామమాత్రంగా కొనసాగుతున్నా పాలకులు, సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడలేదు. సమస్యలతోపాటు విద్యార్థుల క్రమశిక్షణపై శ్రద్ధ చూపే వారు లేకపోవడంతో తమ పిల్లలను హాస్టల్‌లో చదివించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. చాలా మంది విద్యార్థులు నిత్యం పరిసర గ్రామాల నుంచి ఉప్పునుంతల జెడ్పీహెచ్ఎస్‌కు వచ్చి వెళ్తున్నారే తప్పా హాస్టల్‌లో ఉండటం లేదు.

సమస్యలతో సాగని చదువులు..

దాదాపుగా 15ఏళ్ల క్రితం నిర్మించిన ఈ హాస్టల్ భవనంలో తలుపులు, కిటికీలు సరిగా లేవు. చలికాలంలో విద్యార్థులు కిటికీలకు దుస్తులు అడ్డుగా కడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో పాటు స్నానపు గదులు, మరుగుదొడ్లకు తలుపులు లేవు. హాస్టల్ స్నానపు గదులు, మరుగుదొడ్లు ఇళ్లకు అనుసరించి ఉండటం, ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. బాత్‌రూంలు సరిగాలేక కొంతమంది ఆరుబయటనే స్నానాలు చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే కంపు తట్టుకోలేకపోతున్నామని సమీపంలో ఉన్న ఇళ్ల వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

హాస్టల్ చుట్టూ ప్రహరీ లేక..

హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఉన్న కొద్దిమంది విద్యార్థుల్లో విచ్చలవిడి తనం పెరిగిపోయింది. హాస్టల్‌లో ఉండకుండ బయట తిరగడం, రాత్రిళ్ల గ్రామానికి చెందిన విద్యార్థుల ఇళ్లలో పడుకోవడం వంటి వాటితో క్రమశిక్షణ పక్కదారి పడుతుంది. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు కనీసం పాఠశాలకు వెళ్తున్నారా? లేదా అనే విషయాన్ని కూడా చూసే వారు లేరు. పలుమార్లు అధికారులు రాత్రిళ్లు హాస్టల్‌లో బసచేసి సమస్యలను దగ్గరగా ఉండి చూసినా ఇప్పటివరకు ఏ ఒక్క సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవు. హాస్టల్‌కు సంబంధించిన స్థలంలో పిచ్చిచెట్లు, గడ్డి పెరగడంతో పరిసర ప్రాంతం అపరిశుభ్రంగా మారాయి.



తలుపులు లేని విద్యార్థుల స్నానపు గదులు, మరుగుదొడ్లు ,హాస్టల్‌లో కిటికీలకు విరిగిన తలుపులు


పెద్దకొత్తపల్లి ఎస్సీ హాస్టల్‌లో తలుపులు లేని మరుగుదొడ్లు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్లు, బాత్రూంలకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది నుంచి వీటి తలుపులు లేకపోవడంతో విద్యార్థులు వాటినే ఉపయోగించుకుంటున్నారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వార్డెన్ రవితేజ తెలిపారు. ప్రస్తుతం హాస్టల్‌లో 40 మంది విద్యార్థులు ఉన్నారు.


తాడూరు బాలికల వసతిగృహంలో శిథిలావస్థలో వంటగది


తాడూరు బాలికల వసతిగృహంలో అపరిశుభ్రంగా పరిసరాలు

అపరిశుభ్రతకు నిలయాలుగా..

తాడూరు: మండల కేంద్రంలోని బాలికల వసతి గృహం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఇక్కడ పనిచేసే వార్డెన్ మరో వసతి గృహానికి ఇన్‌చార్జిగా ఉండడం వల్ల పనిభారమైందని విచారం వ్యక్తం చేశారు. ఇక్కడ పనిచేసే వర్కర్లు స్థానికంగా ఉండకపోవడం వల్ల పరిసరాలలో పరిశుభ్రత లోపించింది. వసతి గృహంలో నీటి సమస్య కారణంగా మూత్ర శాలలు పరిశుభ్రంగా ఉంచలేకపోతున్నామన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని తెలియజేసిన పట్టించుకోవడం లేదని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



హాస్టల్‌లో సమస్యలు పరిష్కరిస్తే చదువుకోవడానికి మంచి వాతావరణం ఏర్పడుతుంది. చుట్టూ ప్రహరీ లేక పశువులు, మేకలు, పందులు పరిసర ప్రాంతంలో తిరుగుతుంటాయి. ప్రహరీ ఉంటే విద్యార్థులం పాఠశాల నుంచి వచ్చిన తర్వాత గేట్‌కు తాళం వేస్తే బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా ఉంటుంది. బాత్‌రూంలు సరిగా లేవు. పరిస్థితి సరిగా లేక హాస్టల్‌లో విద్యార్థులు ఉండటానికి ఇష్టపడటం లేదు.

– నరేందర్, పదో తరగతి, హాస్టల్ విద్యార్థి

మరమ్మతు చేయించాలి



కొన్నేళ్లుగా నిర్వహణ లేక హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. మరమ్మతు చేయించి కొత్తగా తలుపులు, కిటికీలు అమర్చి కలర్ వేయిస్తే బాగుంటుంది. గడ్డి, చెట్లు పెరిగి హాస్టల్ పరిసర ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. పక్కనే ఇళ్లు ఉండటం, ప్రహరీ లేకపోవడంతో స్నానాలు చేయడం ఇబ్బందిగా ఉంది. హాస్టల్ చదువుకోవడానికి మంచి వాతావరణం నెలకొల్పాలి.

– సాయికుమార్, 9వ తరగతి, హాస్టల్ విద్యార్థి

పలుమార్లు విన్నవించినా..

హాస్టల్‌లో సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి, మండల సమావేశంలో ప్రజా ప్రతినిధులు, స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరుగుదొడ్లు, బాత్‌రూంలు సరిగా లేకపోతే సొంత డబ్బులతో తాత్కాలికంగా బాగు చేయించాం. హాస్టల్ చుట్టూ ప్రహరీ లేక ఇబ్బందిగా ఉంది. పశువులు, మేకలు తిరుగుతుండటంతో హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటినా ప్రయోజనం లేదు.

– రమేష్, బీసీ హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్, ఉప్పునుంతల

బస్సుల కోసం విద్యార్థుల రాస్తారోకో


రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

అచ్చంపేట రూరల్: తమ గ్రామాలకు వెళ్లడానికి సరైన బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని శనివారం రాత్రి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద విద్యార్థులు రాస్తారోకో చేశారు. ఉన్నత చదువుల కోసం అచ్చంపేటలోని కళాశాల, పాఠశాలకు వస్తున్నామని, ప్రతి రోజు సకాలంలో బస్సులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని అమ్రాబాద్ మండలానికి చెందిన విద్యార్థులు చెప్పారు. అమ్రాబాద్ రూటు వెళ్లే బస్సులన్నీ జనంతో కిక్కిరిసిపోతున్నాయని, విద్యార్థులు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, డ్రైవర్, కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. బస్సులు లేక గంటల తరబడి బస్టాండ్‌లో ఉండాల్సి వస్తోందన్నారు.

వేళల్లో మార్పులు చేయండి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రం నుంచి పెద్దకార్పాముల, అంబడిపల్లి, లింగాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు తిరిగే వేళలు ఉదయం పూట మార్పులు చేపట్టాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరారు. గతంలో పాఠశాలలు 9:30 గంటలకు ప్రారంభమయ్యేవని, ప్రస్తుతం 9 గంటలకు ప్రారంభించడంతో బస్సులు వనపర్తి, నాగర్‌కర్నూల్ 8:30, 9గంటలకు నడిపించాలని వారు కోరుతున్నారు.

వైద్యుడిని నియమించాలని డిమాండ్

కోడేరు: మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిని నియమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు కాకం దీప, మిద్దె చెన్నమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్టాఫ్ నర్సులు కూడ తక్కువగా ఉన్నారని ఏఎన్ఎంలతో వైద్యం చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అందుబాటులో ఎరువులు

లింగాల: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు యూరియా, డీఏపీ అందుబాటులో ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఎరువుల విక్రయాలను ప్రారంభించారు. 220 మెట్రిక్ టన్నుల యూరియా, మరో 45 టన్నుల డీఏపీ నిల్వలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎరువులు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు సమర్పించి కొనుగోలు చేయాలని సూచించారు. సీఈఓ పాండు, డైరెక్టర్ శంకర్‌నాయక్, మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

‘యువత ఆదర్శంగా తీసుకోవాలి’



అచ్చంపేట రూరల్: డాక్టర్ బాబు జగ్జీవన్‌రాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, శంకర్, నారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీక్

చారకొండ: మండలంలోని జూపల్లికి చెందిన వృద్ధురాలు కంబాలపల్లి కిష్టమ్మ శనివారం ఇంట్లో వంట చేసేందుకు వెళ్లగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో ఆమె వెంటనే బయటకు రాగా స్థానికులు సిలిండర్‌ను కర్రలతో బయటకు లాగారు. మంటలు అధికమవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

పెంపుడు జంతువులకు టీకాలు

వెల్దండ: మండల కేంద్రంలోని పశువైద్యశాలల్లో జూనోసిస్ డే సందర్భంగా శనివారం డాక్టర్ శ్యామ్‌సుందర్ పెంపుడు జంతువులకు యాంటి రేబిస్ టీకాలను వేశారు. ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులకు యాజమానులు నివారణ టీకాలను ఖచ్చితంగా వేయించాలన్నారు. రేబిస్ విస్తరణ నివారణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పెంపుడు కుక్కల యాజమానులు స్వయంగా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది నరేష్‌రెడ్డి, ఫణిందర్‌రెడ్డి, రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

మహిళల రక్షణ షీటీం బాధ్యత


మాట్లాడుతున్న ఏఎస్ఐ విజయలక్ష్మి

బిజినేపల్లి: మహిళల రక్షణ బాధ్యత షీ టీంలదేనని షీటీం ఇన్‌చార్జి ఏఎస్ఐ విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని వట్టెం బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల సంరక్షణ, మహిళలపై వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏఎస్ఐ మాట్లాడుతూ మహిళలు అన్యాయానికి గురైనప్పుడు తమను సంప్రదించాలని సూచించారు. బాలికల భద్రతాపరంగా పలు అంశాలు, చట్టాలపై అవగాహన కల్పించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు ఆదివారం రంగారెడ్డి జిల్లాలోని పుల్లెల గోపీచంద్ బ్యాట్మింటన్ ప్రధాన స్టేడియంలో నిర్వహించే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. అండర్-8, 50మీటర్లలో కనిష్క, అండర్-10, 300 మీటర్లలో మోక్ష, అండర్ - 8, 50 మీటర్ల విభాగంగా సాత్విక్, అండర్-10, వంద మీటర్ల విభాగంలో అమిత్ చౌహాన్, సంతోష్ ఎంపికయ్యారు. విద్యార్థులను కోచ్ రాణా మల్లేష్ అభినందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

తెలకపల్లి: గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేసి ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ కాగా, వారికి శనివారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మల్లికార్జున్, లక్ష్మీనర్సింహారెడ్డి, నర్సింహులు, తేజ, రమాదేవి, రంజిత్, మధుసూదర్, బాలయ్యను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు మంచి విద్యను అందించారని ఎంఈఓ చంద్రుడు కొనియాడారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని గగ్గలపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం జేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని బంగారు భవిష్యత్‌ను ఏర్పాటు చేసుకోవాలని పౌండేషన్ చైర్మన్ సతీష్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కొండ గణేష్, శాంతకుమార్, షాకీర్‌పాషా, ఆనంద్‌గౌడ్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ కరుణాకర్ పలకలు, మార్కర్‌లు, పెన్నులు, పెన్సిల్, డిక్షనరీలు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.


గగ్గలపల్లిలో నోటు పుస్తకాలు అందజేస్తున్న జేఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

కొల్లాపూర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ సూచించారు. కళాశాల ఆవరణలో శనివారం అధ్యాపకులు, విద్యార్థులు సంయుక్తంగా మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమస్త జీవరాశి ప్రాణాధారమైన ఆక్సిజన్ కాపాడుకోవాలంటే మొక్కలను పెంచడం ఒక్కటే మార్గమన్నారు. ఆధునికత పేరుతో వాతావరణం కాలుష్యానికి మనమే కారణమవుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ కురుమయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, అధ్యాపకులు ఉన్నారు.

జీఓను వెంటనే విడుదల చేయాలి


మాట్లాడుతున్న మారేడు శివశంకర్

నాగర్‌కర్నూల్‌రూరల్: ఐసీడీఎస్ పథకంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్‌కై ప్రభుత్వం జీఓ విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్ చెల్లిస్తామని చెప్పి ఏడు నెలలు గడుస్తున్నా పాత జీఓను రద్దు చేయకపోవడంతో టీచర్లు, ఆయాలు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ నెల 3న అంగన్‌వాడీ అసోసియేషన్ ప్రతినిధి వర్గం మంత్రి సీతక్కను కలవగా టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్‌లకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తామని హామీ ఇచ్చారని, తక్షణమే జీఓ విడుదల చేయాలని కోరారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి ‘సహకారం’



కల్వకుర్తిలో జెండా ఎగరవేస్తున్న చైర్మన్ జనార్దన్‌రెడ్డి

వెల్దండ: రైతుల సంక్షేమానికి, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రుణాలను అందించి ఆదుకునేవి సహకార బ్యాంకులని కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సింగిల్‌విండో కార్యాలయంలో అంతర్జాతీయ సహకార ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నెహ్రూ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను అందిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో సహకార బ్యాంకులకు సేవలను మరింత విస్తృతం చేసి రైతులకు సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటరెడ్డి, సాయిబాబు, భిక్షపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం చైర్మన్ గుర్వయ్యగౌడ్ ఆధ్వర్యంలో సహకార జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కొండలయ్య, అశోక్, రామకృష్ణ, వెంకటరెడ్డి, సీఈఓ వెంకటయ్య తదితరులు ఉన్నారు.


తాడూరులో..

కల్వకుర్తిరూరల్: స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ జనార్దన్‌రెడ్డి జెండాను ఎగరవేశారు. అనంతరం సహకారం సంఘం ద్వారా రైతులకు అనేక సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్యాం, రామునాయక్, వెంకటయ్య, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని సింగిల్‌విండో ఆవరణలో శనివారం సహకార వారోత్సవాలను సీఈఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. 7రంగుల జెండాను ఆవిష్కరించిన అనంతరం ఏడు రంగులకు సంబంధించిన విషయాలను సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శివ, సురేష్, సంతు, కలీల్, రైతులు పాల్గొన్నారు.

27.8 మి.మీ. వర్షపాతం

కొల్లాపూర్: నియోజకవర్గంలో 27.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు పలు దఫాలుగా వర్షం కురిసింది. ఈ కారణంగా చెరువుల్లో స్వల్పంగా నీటిమట్టం పెరిగింది. రోడ్లపై గుంతల్లో నీరు నిలిచింది. శనివారం రాత్రి కూడా చినుకులు పడ్డాయి. ఈ వర్షాలతో స్థానిక రైతులకు అనుకూలంగా మారిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com